

67 ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** పెద్దసైన్యంతో వస్తున్న శత్రువుల నుంచి రక్షణ కోసం.. జాయపుడు, లలితాంబ అడవిలోకి మళ్లారు. రాత్రి కావడంతో.. ఇద్దరూ ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన మాటుగొయ్యిలో పడిపోయారు. రాత్రంతా అందులోనే ఉన్నారు. తెల్లవారుతుండగా.. జాయపుని అశ్వం విక్రమ అక్కడికి వచ్చింది. దాన్ని చూడగానే.. ప్రాణం లేచొచ్చినట్టు అనిపించింది జాయపకు.

“హమ్మయ్య! లలితా.. త్వరపడు. ఆ కన్నాన్ని పెద్దదిగా పైకి మెట్లలాగా తవ్వుకుంటూ పోదాం!” అన్నాడు జాయపుడు.

“అలాగే మామా!” అంటూ తన చేతిలోని చురకత్తితో గొయ్యి గోడలను తవ్వడం మొదలెట్టింది లలితాంబ. మరో గంటలో ఇద్దరూ పైకి ఎక్కేశారు.

విక్రమ పరుగున వచ్చి జాయపుణ్ని ఒరుసుకుంటూ సకిలిస్తున్నది ఆప్యాయంగా..

“నా గుర్రం ఎటో పోయింది. నీ గుర్రం.. భలే! నీకోసం ఇక్కడే తిరుగుతున్నది..” అన్నది లలితాంబ.

చెట్ల చాటుగా సూర్యుడు ఇద్దరినీ ఆసక్తిగా చూస్తున్నట్లు.. ఎండ బలం పుంజుకుంటున్నది. ఆ లేత ఎండకు ఆమె అందమైన మోముపై లేలేత నీటి బిందువులు.. ముంగురులకు పూసిన మెరుపు పువ్వుల్లా ఉన్నాయి.

ఎందుకో ఆమె ముఖాన్ని మరీమరీ చూడబుద్ధయ్యింది జాయపునికి..

‘ఎంత వెరపులేని ధీరత్వం..!? ఈమెకు తప్పు పేరు పెట్టింది అక్క!!’..

అతని ఆలోచనలకు అడ్డుపడుతున్నట్లు అన్నది లలిత.

“ఈ గండం గడిచింది. మన తక్షణ కర్తవ్యం?”.

“వెనక్కి పొలవాసనాడు వెళ్లి కమలాంబ వేశ్యాగృహం పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలి. అందుకోసమే కదా మనం వచ్చింది..?!”.

“నీ అశ్వం సంగతి వచ్చేటప్పుడు చూద్దాం. నా అశ్వం అధిరోహించు..” అంటూ లలితాంబను విక్రమపైకి లాక్కుని, ముందు కూర్చోబెట్టుకున్నాడు.

ఇద్దరూ అతిసామీప్యంలోకి రావడం.. ఇద్దరికీ కొత్తగా ఉంది. ఇద్దరూ లేత యవ్వనులు కాదు. స్థిర యవ్వనులు. కామసర్పాలు చుట్టుకున్న ఆకర్షణీయమైన శరీరులు. కామసర్పపు బుసలోని కామోద్దీపన తెలిసిన మానసాలు.

విక్రమ కదిలింది. తిరిగి పొలవాసనాడు వెళ్లారు. కమలాంబ వేశ్యావాటిక స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నది.

రెండు రాజబృందాల మధ్య గొడవ.. వేశ్యావాటిక విడిచి రాజనగరికి మళ్లింది. కమలాంబ కృతజ్ఞత వెలిబుచ్చి ఇద్దరికీ ఘనమైన వీడ్కోలు పలికింది.

లలితాంబ మరో అశ్వం ఏర్పాటు చేసుకుంటుందని జాయపుడు భావించాడు. కానీ, ఆమె తిరిగి ఎగిరి అతని అశ్వంపై, అతని ముందు కూర్చుంది. జాయపునికి ఓ యవ్వనవతి తన శరీరానికి పూర్తిగా తాకుతూ.. కాదుకాదు ముడుచుకుని ఒడిలో కూర్చోవడం.. ఇబ్బందిగా లేదు కానీ, కొత్తగా.. ఏదో బానే ఉంది. మౌనంగా ఆ ఇరుకులో ఆమె కూర్చున్న తీరులో ఇష్టం స్పష్టం.

విక్రమ కదలికల వల్ల దాదాపు రెండు గవ్యూతుల దూరప్రయాణం.. ఎలా ఉండబోతున్నదో.. జాయపునికి కొంచెంగా అవగతమవుతున్నది.

విక్రమ ఉత్సాహంగా.. కొంటె నడకలతో పరుగుపెడుతూనే ఉంది. పైనున్న జాయపుడు, లలితాంబ ఎగిరెగిరి పడుతూనే.. తగులుతూ తాకుతూ ఒడిలో ఒదుగుతూ.. ఊగుతూ! అది ఓ రసరమ్య ఊయల క్రీడ. రహదారి పక్కగా ఎవరు వస్తూ పోతున్నారో.. ఏమో.. ఏమీ తెలియడం లేదు.